



బాపట్ల జిల్లా రేపల్లెలోని అంబేద్కర్ సెంటర్‌లో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి



నాడు రేపల్లెలో గోవిందుడి మురళీరవానికి ప్రజలంతా మంత్రముగ్ధులై తన్మయత్వం చెందేవారు. గోవిందుడు అందరి వాడే అన్నట్లు ఆయన పాలనలో చీకూచింత లేకుండా జీవించేవారు. సోమవారం రేపల్లెలో అదే దృశ్యం సాక్షాత్కరించింది. జగనన్న రాకతో రేపల్లె మురిసింది. ఎన్నికల కురుక్షేత్రంలో ఒంటరి పోరాటం చేస్తున్న యోధుడు ప్రసంగం వినడానికి ఊరూవాడా కదలివచ్చింది. తెలతెలవారగనే తలుపుతట్టి ఠంఛన్‌గా పింఛన్ అందిస్తున్న మనవడిని చూడటానికి పండుటాకులు రెక్కలు కట్టుకుని వచ్చారు. పేదింటి పిల్లలకు పెద్దింటి చదువులు అందించిన జగన్ మామయ్యను కళ్లారా చూడటానికి విద్యార్థులు తరలివచ్చారు. వ్యవసాయాన్ని పండుగలా చేసిన రాజన్న బిడ్డకు ఎన్నికల్లో సంఘీభావం తెలపడానికి రైతులు కదలివచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, నేడు ధీమాగా, ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చిన జగనన్నకు జేజేలు పలికారు. కూటమి కుట్రలు, కుతంత్రాలు, మాయోపాయాల ఉచ్చులో పడబోమని నినదించారు.

రేపల్లెలో జగనోత్సాహం

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు పోటెత్తిన జనం

- మండేఎండలను ఖాతరు చేయని ప్రజలు
- మళ్లీ ఫ్యాను గుర్తుకే ఓట్లంటూ నినాదాలు
- చంద్రబాబును తరిమి కొడతామంటూ తేల్చి చెప్పిన జనం
- వైఎస్.జగన్ ప్రసంగానికి అపూర్వ స్పందన
- ఉత్సాహంలో పార్టీ శ్రేణులు



అదుగో జగన్ మామయ్య : సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తండ్రి భుజం ఎక్కిన చిన్నారి



విజయోస్తు : ఆసరాతో ఆదుకున్న జగనన్నను చూసిన ఆనందంలో అక్కాచెల్లెళ్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రేపల్లెలో సోమవారం ఉదయం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సభకు జనం పోటెత్తారు. రేపల్లె పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు, యువత, విద్యార్థులు, చిన్నారులు అనే తేడా లేకుండా వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని ఉదయం 7 గంటల నుంచే రేపల్లె బాట పట్టారు. మండే ఎండల్ని సైతం ఖాతరు చేయలేదు. కొందరు తల్లులు చంటి బిడ్డల్ని సైతం సభకు తీసుకు రావడం కనిపించింది. ఎనభై సంవత్సరాలు దాటిన వృద్ధులు కూడా జగన్‌ను చూడాలన్న ఉత్సాహంతో రేపల్లె ఎన్నికల సభకు వచ్చారు. వైఎస్.జగన్ రాగానే కొందరు అవ్వాతాతలు ఉత్సాహం ఆపుకోలేక ఆనందంతో జెండాలు చేతబట్టి నృత్యాలు చేశారు. సభకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. రేపల్లె ఎన్నికల సభ జనసంద్రంగా మారింది.

ఉత్తేజం నింపిన ప్రసంగం

సభలో ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం జనాన్ని ఉర్రూతలూగించింది. ఐదేళ్ల పాలనలో అమలు చేసిన పథకాల్ని ప్రస్తావించిన ప్రతిసారీ జనం ఈలలు, కేకలతో సభను హోరెత్తించారు. చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాన్ని వివరించినప్పుడు మళ్లీ ఆయన పాలన వద్దంటూ జనం కేకలతో స్పందించారు. 59 నెలల పాలనలో నా అక్కాచెల్లెళ్ల కుటుంబాలకు రూ 2.70 లక్షల కోట్లు బటన్ నొక్కి నేరుగా మీ ఖాతాల్లోనే వేశానని జగన్ చెప్పగానే సభకు వచ్చిన మహిళలు సీఎం...సీఎం అంటూ నినదించారు. 2.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చానని, ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశానని జగన్ వివరించగానే జనం జై జగన్ అంటూ సభను హోరెత్తించారు. పాఠశాలల్ని ఆధునికీకరించి ఇంగ్లిషు చదువుల్ని ప్రవేశపెట్టానని, డిజిటల్ బోధనతో పాటు అందరికీ ట్యాబ్‌లు ఇచ్చానని, అమ్మఒడితో పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించానని జగన్ చెప్పగానే సభకు వచ్చిన విద్యార్థులు, తల్లుల కేకలు, ఈలలతో స్పందించారు. నిరుపేదలు 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి 22 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చామని జగన్ చెప్పగానే జనం పెద్దపెట్టున నినదించారు. అవ్వాతాతలకు వలంటీర్ల ద్వారా ఇంటి దగ్గరే పింఛన్, రైతులకు రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, చేనేతలకు నేతన్న నేస్తం, మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇస్తున్నట్లు జగన్ చెప్పగానే పెద్దఎత్తున సభలో ఉన్న ఆయా వర్గాల ప్రజలు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ రెండు పథకాలతో తమకు లబ్ధి చేకూరిందని వారు చర్చించుకోవడం కనిపించింది. పేదలకు రూ. 25 లక్షలతో ఆరోగ్యశ్రీ సేవలు విస్తృత పరిచినట్లు జగన్ చెప్పారు. సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు 600 రకాలు సేవలు అందిస్తున్నట్లు చెప్పగానే జనం ఈలలతో బదులిచ్చారు.



చంద్రబాబుపై విమర్శల జోరు

వంచనే అజెండాగా చంద్రబాబు పాలనలో ప్రజలకు ఒక్క మేలు జరగలేదని వైఎస్.జగన్ విమర్శించగానే జనం అవును అవును అంటూ బాబుకు వ్యతిరేక నినాదాలు చేశారు. 14 సంవత్సరాల పాలనలో చంద్రబాబు ప్రజలు గుర్తించుకునేలా ఒక్కటంటే ఒక్కస్కీమైనా తెచ్చారా? ఏ పేదవాడికైనా ఆయనవల్ల మంచి జరిగిందా? అని జగన్ ప్రశ్నించగానే లేదు ..లేదు అంటూ స్పందించారు. రైతు రుణమాఫీ అన్నాడు, డ్వాక్రా రుణమాఫీ అన్నాడు, ఆడబిడ్డకు మహాలక్ష్మీ పథకం అన్నాడు అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటైనా చేశాడా? అని వైఎస్.జగన్ ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అన్నాడు.. నిరుద్యోగ భృతి అన్నాడు.. ఏ ఒక్కటైనా చంద్రబాబు నెరవేర్చాడా? అని జగన్ ప్రశ్నించగానే జనం చంద్రబాబు నమ్మకద్రోహి, నమ్మక ద్రోహి అంటూ పెద్దఎత్తున నినదించారు. ఈసారి ఎన్నికల్లో తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటేసేందుకు మీరంతా సిద్ధమా అనగానే మేము సిద్ధం, సిద్ధం అంటూ సభకు వచ్చిన జనం నినాదాలతో సభ హోరెత్తిపోయింది. 175 కు 175 అసెంబ్లీ, 25 కు 25 పార్లమెంట్ స్థానాలు గెలిపించేందుకు మీరు సిద్ధమా? అనగానే జనం సిద్ధం అంటూ మరింత గట్టినా నినాదాలు చేశారు. ఉదయం 11:05 గంటలకు రేపల్లె హెలిపాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 11:20 కి సభాప్రాంగణానికి చేరుకున్నారు. 11:36 గంటలకు ప్రసంగం మొదలు పెట్టి 12:05కు ముగించారు. ఆ తర్వాత 12:29 గంటలకు రేపల్లె నుంచి పల్నాడు జిల్లా మాచర్లకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి ఈవూరి గణేష్, రేపల్లె ఎన్నికల పరిశీలకుడు గాదె మధుసూదన్‌రెడ్డి, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, బాపట్ల జిల్లా చేనేతల సంఘం అధ్యక్షుడు రవి అవ్వారు పాల్గొన్నారు. .



వెల్లువెత్తిన అభిమానం : సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో రేపల్లె ప్రజలు



గుడ్ లక్ అన్నా: సీఎం వైఎస్. జగన్‌ను చూసి ఆనందంతో అభివాదం చేస్తున్న యువత

రానున్నది జగనన్న ప్రభుత్వమే

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె రూరల్/ చెరుకుపల్లి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అఖండ మెజార్టీతో మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ధీమా వ్యక్తం చేశారు. రేపల్లె పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటరులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రేపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడం ఖాయమని తెలిపారు. డాక్టర్ ఈవూరు గణేష్‌ను గెలిపించుకుని రేపల్లె అసెంబ్లీ స్థానాన్ని జగనన్నకు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి నవరత్న పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచారని పేర్కొన్నారు. రేపల్లె నియోజకవర్గంలోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా అవినీతికి తావునివ్వకుండా



రూ.1,545 కోట్లకు పైగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ అయ్యాయని వెల్లడించారు. ఇంత సంక్షేమం గతంలో ఏ ప్రభుత్వ హయాంలో జరిగిన దాఖలాలు లేవని తెలిపారు. రేపల్లె ప్రచార సభకు వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే గణేష్ విజయం ముందుగానే ఖరారైనట్లుందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మోపిదేవి పిలుపునిచ్చారు.

జగనన్న జెండా ఎగరడం ఖాయం

బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో జగనన్న జెండా రెపరెపలాడటం ఖాయమని బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్ అన్నారు. ప్రజలంతా ఏకమై జగనన్నకు అండగా నిలబడటంతో కూటమికి తిప్పలు తప్పవని తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలు డిపాజిట్‌లు కోల్పోయి చుక్కలు లెక్కపెట్టుకోవాల్సిందేనని విమర్శించారు. ప్రజా మద్దతుతో జగనన్న సింగిల్‌గా వస్తుంటే 40 సంవత్సరాలు అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడారని ధ్వజమెత్తారు. ఇటీవల చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో మోసపూరితమని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు జగనన్న అమలు చేసిన పథకాలను వ్యతిరేకించిన చంద్రబాబే నేడు వాటిని తన మేనిఫెస్టోలో పొందుపరిచి ప్రజలను మోసగించేందుకు సిద్ధపడ్డారన్నారు. పింఛన్ రూ.4వేలు అని



ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం వైఎస్. జగన్

ప్రకటించిన రెండు రోజుల్లోనే మేనిఫెస్టోలో దాన్ని లేకుండా చేశాడని గుర్తు చేశారు. 2019లో 151 ఎమ్మెల్యే సీట్లను బహుమతిగా అందించిన ప్రజలు ఈ సారి 175కు 175 అందించి అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని సురేష్ కోరారు.

ఐదేళ్లలో వందేళ్ల సంక్షేమం

రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గణేష్

రాష్ట్రంలో ప్రజలకు వందేళ్లలో అందించాల్సిన సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కేవలం ఐదేళ్లలో అందించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు అదనంగా ప్రజావసరాలకు అనుగుణంగా అనేక పథకాల్ని విజయవంతంగా అమలు చేసింది జగనన్న మాత్రమేనని పేర్కొన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రెండేళ్ల పాటు దేశం అతలాకుతలమైనా రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం ఆగలేదని గుర్తు చేశారు. వైద్యరంగంలో నూతన సంస్కరణలు అమలు చేసి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచి పేదల ముఖ్యమంత్రిగా జగనన్న గుర్తింపు పొందారని గుర్తు చేశారు. పేదల కోసం పలు సంక్షేమ పథకాల



అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గణేష్‌ను ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం వైఎస్. జగన్

అమలు చేస్తున్న జగనన్నకు ప్రజలంతా సీఎం పదవిని గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేపల్లె ఎన్నికల పరిశీలకుడు అడపా శేషు, గాదె మధుసూదనరెడ్డి, వైఎస్సార్ సీపీ యువ నాయకులు మోపిదేవి రాజీవ్, ఈవూరు సృజన్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితులకు యావజ్జీవ శిక్ష

పర్చూరు (చినగంజాం): అక్రమ సంబంధం నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు పీడీజే కోర్టు న్యాయమూర్తి ఎ.భారతి తీర్పు నిచ్చారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలలోకి వెళ్తే.. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన నవాబు సురేష్ 2015లో హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన ఆరుద్ర సాంబశివరావు అనే వ్యక్తి నవాబు సురేష్ భార్య నవాబు శివతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో విషయం తెలిసిన గ్రామ పెద్దలు సాంబశివరావు, శివలను మందలించారు. అప్పటినుంచి సాంబశివరావు సురేష్‌పై కక్ష పెంచుకొన్నాడు. ఎలాగైనా అతన్ని చంపాలని 2015 ఫిబ్రవరి 2 రాత్రి చెరుకూరులో నడిచి వెళ్తున్న సురేష్‌ను వెనుక నుంచి కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్ సోదరుడు నవాబు గోపీ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ మాధవరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఇంకొల్లు సీఐ ఎం.శ్రీనివాసరావు కేసు విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఒంగోలు పీడీజే కోర్టులో విచారణకు రావడంతో మార్టూరు సీఐ సి.సీతారామయ్య పర్యవేక్షణలో పర్చూరు ఎస్‌ఐ ఎస్.రమేష్‌లు ఆధ్వర్యంలో వాదనలు వినిపించగా న్యాయమూర్తి ఎ.భారతి ఇరువురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

జగనన్న.. మా నమ్మకం నువ్వే

ఒకరా.. ఇద్దరా.. సీఎం వైఎస్ జగన్ అందజేసిన పథకాల ద్వారా లబ్ధిపొందినవారు ఎందరో.. మాట తప్పని, మడమ తిప్పని ఆయన నైజంకు, విశ్వసనీయతకు ఫిదా అయినవారు మరెందరో.. తమకెంతో మేలు చేసిన అభిమాన నేతను చూసి తరించాలనుకునేవారే అందరూ.. రేపల్లెలో జరిగిన సీఎం సభకు విచ్చేసిన వారందరూ.. తమ అభిమాన నేతను దగ్గరగా చూశామంటూ.. కల నెరవేరిందంటూ ఆనందం వ్యక్తం చేయగా.. మరికొందరు తాము పొందుకున్న మేలులు బట్టి ఆనందభాష్పాలు రాల్చారు.. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినదించారు. – బాపట్ల టౌన్

జగనన్న అంటే నమ్మకం



గతంలో చంద్రబాబు నాయుడు పరిపాలన చూశాం. ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలన్నీ ఇస్తారు. ఎన్నికల తర్వాత వాటిల్లో ఏ ఒక్కటీ అమలు చేయరు. జగనన్న చెప్పారు అంటే.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తప్పక చేస్తారు. అందుకే మాకు జగనన్న అంటే నమ్మకం. గడిచిన ఐదేళ్లల్లో ఒక్క నా కుటుంబానికే పెన్షన్, ఆసరా, అమ్మ ఒడి, చేయూత లాంటి పథకాల ద్వారా లక్షల రూపాయల లబ్ధి జరిగింది. జగనన్నకు మేమంతా అండగా లేకపోతే మమ్ములను ఆ దేవుడు కూడా క్షమించడు.

– షేక్ హసీనా, కనగాల

నా దేవుడు జగనన్న



నేను కరెంట్ పనిచేస్తుంటాను. నెల రోజుల క్రితం విద్యుత్‌ప్రభకు లైటింగ్ వేస్తుంటే జారి కింద పడ్డాను. నా చెయ్యి రెండు చోట్ల విరిగింది. గుంటూరు, విజయవాడ వెళ్లి ఆపరేషన్ చేయించుకోవాలి అని డాక్టర్లు చెప్పారు. దీనికి రెండు రాడ్లు వేసి ఆపరేషన్ చేయాలి రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇంతలో మా జగనన్న ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని హాస్పిటల్‌కు వెళ్లాను. ఒక్క రూపాయి డబ్బులు తీసుకోకుండా నాకు ఆపరేషన్ చేశారు. 15 రోజుల క్రితమే ఆపరేషన్ జరిగింది. డాక్టర్లు రెస్ట్ తీసుకోవాలని చెప్పినా. నా దేవుడిని దగ్గరగా చూసేందుకు వచ్చాను.

– తిరుమెళ్ల రాజశేఖర్, గూడవల్లి

చంద్రబాబు పాలనలో నరకం చూశాం



చంద్రబాబు పాలనలో వర్షాలు పడక, పంటలు పండక నరకాన్ని అనుభవించాం. బోర్లు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగుచేసిన పంటలను కొనే దిక్కు ఉండేది కాదు. దళారులే రాజ్యం ఏలేవాళ్లు. వాళ్లు చెప్పిన రేటుకే మేం అమ్ముకోవాలి. మా బిడ్డ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాకు అన్నివిధాల అండగా ఉన్నాడు. రైతుభరోసా పేరుతో మాకు డబ్బులు ఇవ్వడమే కాదు. మేము పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించి నేరుగా ప్రభుత్వంతోనే కొనుగోలు చేయించాడు.

– ఆరాధ్యులశ్రీనివాసరావు, కనగాల

కులం నుంచి వెలేస్తామన్నా ..



నేను రేపల్లె 7వ వార్డులో ఉంటాను. మా కులపోళ్లంతా గత ఎన్నికల్లో టీడీపీకు అనుకూలంగా ఉన్నారు. నేను జగన్ అన్న చెప్పిన మేనిఫెస్టోను నమ్మి జగనన్నకే నా మద్దతు అన్నాను. అప్పుడు నన్ను మా కులంలోని వాళ్లు చాలా ఇబ్బందులు పెట్టారు. అయినా సరే నేను జగనన్నతోనే ఉన్నాను. జగనన్న సీఎం అయిన తర్వాత చేసిన పథకాలు చూసి ఇప్పుడు మా కులంతో పాటు, మిగిలిన వాళ్లు కూడా జగనన్నకు ఫ్యాన్స్‌గా మారారు. మాకు ఇంటి స్థలంతో పాటు అనేక పథకాలు అందాయి. నా ఇద్దరు కుమార్తెలతో కలిసి జగనన్న సభకు వచ్చాను.

– వీసం నాగలక్ష్మి, రేపల్లె టౌన్

చంద్రబాబు హామీలు ఎవరూ నమ్మరు



చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా ఎవరూ నమ్మరు. 2014లో మాకు నిరుద్యోగ భృతి ఇస్తాను అని చెప్పాడు. 2019 ఎన్నికలకు వెళ్లే ముందు రెండు నెలలు మాత్రమే ఇచ్చాడు. ఆయన హామీలు ఇవ్వడం వరకే.. ఎన్నికల తర్వాత చేయడు. జగనన్న మాట ఇస్తే తప్పకుండా చేస్తాడు.

– తోట ప్రసన్న, రేపల్లె టౌన్

మా భవిష్యత్తు జగనన్నే

మేమంతా రేపల్లెలోని క్రిస్టియన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుతున్నాం. గత టీడీపీ పాలనలో మాలాంటి పేదలకు ఎలాంటి ప్రోత్సాహం లేదు. మా జగనన్న సీఎం అయిన తర్వాత మా కష్టాలు తెలుసుకొని మా చదువులు మా తల్లిదండ్రులకు భారం కాకూడదని విద్యాదీవెన, వసతిదీవెన రూపంలో మా తల్లుల అకౌంట్‌లలో నగదు జమచేస్తున్నారు. అంతేకాదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో మేము కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తిఫీజును మా జగనన్నే చెల్లిస్తున్నారు. విద్యార్థులమంతా అండగా ఉన్నామని చెప్పేందుకు ఈ సభకు వచ్చాం.

– రేపల్లె నర్సింగ్ కళాశాల విద్యార్థులు



జాతీయస్థాయి తైక్వాండోలో గోల్డ్ మెడల్



చినగంజాం: జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన బక్కా ఏడుకొండలురెడ్డి గోల్డ్‌మెడల్ సాధించాడు. యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4,5,6 తేదీలలో గోవాలో నిర్వహించిన పోటీలలో ఏడుకొండలు రెడ్డి పాల్గొని, సీనియర్ అండర్ 74కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ విద్య, యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ అభిలాష్ కుమార్, యూత్ అండ్ డెవలప్‌మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ప్రెసిడెంట్ హెచ్.రవిశంకర్ రాజు, కోచ్‌లుగా సయ్యద్ సలావుద్దీన్, పి.ప్రశాంత్ బాబులు వ్యవహరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 94.5శాతం



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, సిహెచ్ శ్రీధర్

బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 94.5శాతం నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ శ్రీధర్ పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 1224 ఓటర్లు ఉండగా ఆదివారం 797మంది ఓటు హక్కును వినియోగించుకోగా, సోమవారం 360 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మొత్తం 1157 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ శాతం 94.5శాతం నమోదయింది. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు జరగుతున్న తీరును జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా పరిశీలించారు.

● సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామం, కర్లపాలెం మండలం కర్లపాలెం గ్రామాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి సోమవారం పరిశీలించారు. చందోలు, కర్లపాలెంలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. గత ఎన్నికలలో పరిస్థితులు, అనుభవాలపై ఆరా తీశారు. స్థానిక ఓటర్లతో మాట్లాడారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇలాంటి కేంద్రాలపై సూక్ష్మ పరిశీలకుల నిఘా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ కె.స్ఫూర్తి తదితరులు ఉన్నారు.

● ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర నిఘా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, వెబ్ క్యాస్టింగ్ విధానాన్ని ఆయన పరిశీలించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటైన రూములు, వాటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట బాపట్ల రిటర్నింగ్ అధికారి సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, పలు శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

గెలిపించండి.. అండగా ఉంటాం

● ఐదేళ్లలో చీరాలను సుందరంగా తీర్చిదిద్దింది కరణం కుటుంబమే
● ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్



మహిళలతో మాట్లాడుతూ ఓటు అభ్యర్థిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే.. మేం చేస్తాం అంతే అని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మున్సిపాలిటీలోని 26, 27, 28 వార్డుల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఈఎన్నికల్లో తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అన్నివేళలా అండగా ఉంటానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన చెప్పారంటే చేస్తారనే నమ్మకం ప్రజలలో బలంగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కడితే సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు నిరంతరం అందుతాయన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ద్వారా అర్హులందరికీ మేలు చేకూరుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. పేదల పెన్నిధిగా పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమంతో జనం గుండెల్లో సీఎం జగన్ కొలువుదీరారన్నారు. సామాజిక సాధికారతను కోరుకునే జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు..

మోసకారి మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పూర్తి మద్దతు పలకాలన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందో ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారికి మెరుగైన సేవలందించామని, నియోజకవర్గంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎమ్మెల్యే కరణం బలరాం సుపరిపాలన అందించారన్నారు. 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, 10వ వార్డు కౌన్సిలర్, క్లస్టర్-2 మహిళా అధ్యక్షురాలు గోలి స్వాతి, సేవా దళ్ సెక్రటరీ గోలి గంగాధర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపులను గౌరవించింది వైఎస్సార్ సీపీనే



కాపు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

● తెలుగుదేశానికి కాపులు బుద్ధి చెప్పాలి
● కాపుల ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

మార్టూరు: రాష్ట్రంలో కాపులను గౌరవించింది ఒక్క వైఎస్సార్ సీపీనే అని వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో సోమవారం మార్టూరు–యద్దనపూడి మండలాల కాపు జన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యడం బాలాజీ పాల్గొన్నారు. ఈసందర్భంగా యడం బాలాజీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకం ఉంచి పర్చూరు అసెంబ్లీ అభ్యర్థిగా టికెట్ కేటాయించారన్నారు. నియోజకవర్గ కాపు బంధుగణమంతా తనను గెలిపించడం ద్వారా సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల కాలంగా కాపులను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తూ వచ్చిన తెలుగుదేశానికి తగిన బుద్ధి చెప్పాలని బాలాజీ అన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలలో పర్చూరు నియోజకవర్గ అభ్యర్థిగా తనను ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌లను సీలింగ్ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాలాజీ పిలుపునిచ్చారు. ప్రముఖ గాయకుడు కళాకారుడు రామిశెట్టి సుబ్బారావు, పార్టీ సీనియర్ కాపు నాయకుడు చేబ్రోలు వెంకటేశ్వరరావు, చేబ్రోలు జగందు, బోగాది రవిచంద్, కోటా శ్రీను, తదితర కాపు నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా యడం బాలాజీకి కాపు నాయకులు ఘన స్వాగతం పలికారు. తొలుత బాలాజీ వంగవీటి రంగా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యడం బాలాజీ సోదరుడు యడం లక్ష్మీ దీపక్, కాపు నాయకులు, పర్చూరు మండల కన్వీనరు పఠాలి అప్పారావు, కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, వైష్ణవి నాగేశ్వరరావు, ముప్పవరపు శ్రీను, తులసి శివ నాగేశ్వరరావు, లంకా శివ, దాసం హనుమంతరావు, సింహదాటి శ్రీనివాసరావు, కొనికి మాజీ సర్పంచి మండి సాంబయ్య, గోగుల పూర్ణ, గణిపిశెట్టి శ్రీనివాసరావు, వెంకట్రావు, బండి బాబు, కోటగిరి మార్కండేయులు, ముప్పవరపు సాంబయ్య, నారాయణ, సూరవరపు పల్లి మాజీ ఉప సర్పంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టో బూటకం



ప్రచారంలో పాల్గొని, ప్రజలకు అభివాదం చేస్తున్న చిన హనిమిరెడ్డి

● వైఎస్సార్ సీపీ అద్దంకి అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
● బల్లికురవ మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం

బల్లికురవ: చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అంతా బూటకమేనని.. ఆ మేనిఫెస్టోను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కొత్తమల్లాయపాలెం, చిన అంబడిపూడి, పెద అంబడిపూడి, గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి జగనన్న మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లాగా పవిత్రంగా భావించి, అమలు చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పారదర్శక పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా కులమత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు జగనన్న అందించారన్నారు.

చంద్రబాబు మాటలు ఉత్తుత్తివే..

14 ఏళ్లు సీఎంగా పనిచేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే పథకం ఒక్కటైనా ఉందా అని హనిమిరెడ్డి ప్రశ్నించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అద్దంకి ఎమ్మెల్యేగా తనకు, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి ఓటుతో ఆశీర్వదించాలన్నారు. మూడు గ్రామాల్లోని ప్రజలు మహిళలు హనిమిరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు ఐవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్, మల్లాపాలెం సర్పంచ్ జూపల్లి రాఘవరావు, స్థానిక నేతలు అబ్బారెడ్డి పార్థ సారథి, జూపల్లి శ్రీనివాసరావు, వీరాంజనేయులు, చింతల శ్రీనివాసరావు, సారెడ్డు శివరామరాజు, కొండూరి హనుమంతరావు, కృష్ణ, తముదాని వెంకటేశ్వర్లు ఆయా గ్రామాల్లోని నేతలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకులు సత్యార్థ్ అనిరుధ్ పంకజ్



ప్రత్తిపాడు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ శాఖ అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకులు సత్యార్థ్ అనిరుధ్ పంకజ్ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన స్థానిక పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం, పెదగొట్టిపాడు, కోయవారిపాలెం గ్రామాల్లోని 19 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, గతంలో ఆయా కేంద్రాల పరిధిలో జరిగిన అల్లర్లు, వాటికి గల కారణాలను సీఐ నిసార్‌బాషా, ఎస్ఐ సోమేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంది? ఎన్నికల సమయంలో ఎలాంటి బందోబస్తు కల్పిస్తున్నారు? వంటి వివరాలపై ఆరా తీశారు. వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

759 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం



చీరాల: స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో రెండోరోజు సోమవారం ఉద్యోగులు జోరుగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పీఓలకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 759 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆది, సోమవారాల్లో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరిగింది. వేటపాలెం తహసీల్దార్ పరాశరం కృష్ణకాంత్, సిబ్బంది పర్యవేక్షించారు.

సర్వీస్ ఓట్లు భద్రం



స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉన్న సర్వీస్ ఓటర్లకు సంబంధించిన ఎలక్ట్రోనికల్లి ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ ద్వారా పోలైన ఓట్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ట్రెజరీ కార్యాలయంలో ఉన్న స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. సోమవారం పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్ల నడుమ రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టర్ వీటిని భద్రపరిచారు.

185 మద్యం సీసాలు స్వాధీనం



పెదకాకాని: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద ఉన్న అండర్‌పాస్‌లో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నంబూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కనపర్తి అజయ్ వద్ద రూ.27,750 విలువ చేసే 180 మిల్లీ లీటర్ల(క్వార్టర్) బాటిళ్లు 185 స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం పెదకాకాని సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

122 మద్యం సీసాలు స్వాధీనం..

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో రెండు మూటల్లో ఉన్న 122 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.మహేష్ కుమార్ సోమవారం తెలిపారు. గరువుపాలెం గ్రామ శివారు ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అనుమానించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నిలుపదల చేయగా స్కూటీని వదిలిపెట్టి పరారయ్యాడు. ద్విచక్ర వాహనంలో 122 మద్యం సీసాలను ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గుంటూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు (ఫైల్)

అమ్మఒడి చల్లన.. జగన్ మామయ్యే దీవెన

అరుణ.. పేదింటి బాలిక.. చదువులో ఎప్పుడూ ముందుండేది. ఆటపాటల్లోనూ ఫస్టే.. తన తెలివితేటలతో ఉపాధ్యాయుల అభిమానం చూరగొంది. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం వారిది. అరుణ తండ్రికి ఆరోగ్యం బాగోలేక మంచానే ఉండాల్సిన దుస్థితి. తల్లి నాలుగు ఇళ్లలో పనులు చేస్తూ వచ్చే అరకొర సంపాదనతో అతికష్టంగా కుటుంబాన్ని పోషిస్తోంది. అరుణ ఆరోతరగతిలో ఉండగా, పోషణ మరింత క్లిష్టంగా మారి బడి మాన్పించి, తనతో పాటు పనికి తీసుకెళ్దామని తల్లి ఆలోచన చేస్తుండగానే బడికి వెళ్లే పిల్లలకు ప్రభుత్వమే మంచి యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బ్యాగు, మధ్యాహ్నం మంచి భోజనం ఇలా అన్నీ ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఏడాదికి రూ.15వేలు ఇస్తుందంట.. అన్నవార్త చెవినిపడింది. దీంతో పనికి పంపే ఆలోచన మానుకుని బడికి పంపింది. ఈ నాలుగేళ్లు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని, పదిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై.. తన గ్రామానికే ఆదర్శంగా నిలిచింది. ఈ నాలుగేళ్లలో అమ్మఒడి కింద రూ.60వేలు జగన్‌మామయ్య సాయం చేశారని, తన భవిష్యత్తు జగన్‌మామయ్యే చూసుకుంటారని అరుణ ధీమా వ్యక్తం చేసింది.

జగనన్న అమ్మఒడితో చదువుల విప్లవం

- నాలుగేళ్లలో ప్రతి తల్లి ఖాతాలో రూ.60వేలు జమ
- పనులకు వెళ్లే పిల్లలను బడిబాట పట్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గుంటూరు జిల్లాలో నాలుగు విడతల్లో రూ.938.62 కోట్ల ఆర్థిక లబ్ధి
- రూ.15వేలుగా ఉన్న ఆర్థికసాయం రూ.17వేలకు పెంపుదల చేసిన సీఎం వైఎస్ జగన్

ఇదిగో.. మార్పు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుల విప్లవాన్ని తెచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లులకు జగనన్న అమ్మఒడి ద్వారా ప్రతి యేటా ఆర్థిక లబ్ధిని చేకూర్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాలకు ఇంటికి పెద్ద దిక్కు అయింది. దేశంలోనే ఒక్కడా లేనివిధంగా పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లుల బ్యాంకు ఖాతాల్లో యేటా రూ.15వేలు జమ చేస్తూ అమలు చేసిన జగనన్న అమ్మఒడి పేద కుటుంబాల తలరాతలు మార్చింది. ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులతో కలిసి పనులకు వెళ్లిన పిల్లలతో పాటు బడి మానేసి డ్రాపౌట్లుగా మారిన బాలలను తిరిగి పాఠశాలలకు తీసుకురావడంలో అమ్మఒడి ఆసరాగా నిలిచింది. ఈ విధంగా గుంటూరు జిల్లాలో 2019–20 విద్యాసంవత్సరం మొదలు ఇప్పటి వరకు ప్రతి యేటా క్రమం తప్పకుండా ప్రభుత్వం అమ్మఒడి సాయం అందించింది. ఇప్పటివరకూ యేటా రూ.15వేలు చొప్పున ప్రతి మాతృమూర్తి నాలుగేళ్ల వ్యవధిలో రూ.60 వేలు అందుకున్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్న జగనన్న ప్రభుత్వం పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలను తల్లిదండ్రులకే అప్పగించింది. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై తల్లిదండ్రులకు సముచిత స్థానం కల్పించింది. అమ్మఒడి ద్వారా ఇస్తున్న ఆర్థిక సాయంలో రూ.2వేలను పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణకు స్వచ్ఛందంగా ఇవ్వాలని చెప్పి, తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంలో తల్లిదండ్రులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడం ద్వారా ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసింది. అమ్మఒడి ఆర్థిక ప్రోత్సాహం నుంచి స్వచ్ఛందంగా ఇచ్చిన టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (టీఎంఎఫ్)ను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పాఠశాలల నిర్వహణ, అభివృద్ధికి వినియోగించే విధంగా చేసిన ఏర్పాట్లతో నిర్దేశిత లక్ష్యం నెరవేరుతోంది.

జిల్లాలో నాలుగేళ్లలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా..

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019-20	1,46,232	రూ.219.34 కోట్లు
2020-21	1,55,330	రూ.232.99 కోట్లు
2021-22	1,64,601	రూ.246.90 కోట్లు
2022-23	1,59,594	రూ.239.39 కోట్లు

నాలుగు విడతల్లో రూ.938.62 కోట్ల ఆర్థిక లబ్ధి..

జగనన్న అమ్మఒడి నాలుగు విడతల్లో జిల్లాలోని మాతృమూర్తులకు రూ.938.62 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. ప్రతి యేటా సగటున 1.60 లక్షల మంది మాతృమూర్తులు ఆర్థిక ప్రయోజనాన్ని పొందుతున్నారు. గత విద్యాసంవత్సరానికి ఐదో విడత ఆర్థిక సాయాన్ని జూన్ నెలలో ప్రభుత్వం అందించనుంది. కాగా అమ్మఒడి ఆర్థిక సాయం రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

అమ్మఒడితో ఆదుకున్న ప్రభుత్వం



మా అమ్మాయి కాషియా ఫాతిమా గుంటూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఇటీవలే టెన్త్ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించింది. 6వ తరగతి నుంచి ఇక్కడే చదివింది. గత నాలుగేళ్లుగా ప్రతి యేటా క్రమం తప్పకుండా జగనన్న అమ్మఒడి అందుకున్నాం. గతంలో ఈ పాఠశాలలో ఎటువంటి వసతులు ఉండేవి కావు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం ఎంతో గొప్పగా అభివృద్ధి చేసింది. ప్రతి యేటా అమ్మఒడి ఇవ్వడంతో పేదవర్గాలకు చెందిన మాలాంటి వారికి ఎంతో అండగా నిలిచింది. పేద పిల్లల చదువులకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి అభినందనీయం

– షేక్ సుభాని, పేరెంట్, గుంటూరు

అమ్మఒడితో అండగా నిలిచారు..



ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ప్రైవేటు పాఠశాలలో చదివించే స్తోమత లేక అమ్మానాన్న నన్ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా ప్రతి ఏడాది అమ్మఒడి ద్వారా ఇచ్చిన డబ్బులు ఇంట్లో ఆసరాగా నిలిచాయి. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా చదువు చెప్పడంతో పాటు విద్యాకానుకతో పుస్తకాలు, బైజూస్ ట్యాబ్ ఇచ్చారు.

– వి.మేఘన, 9వ తరగతి విద్యార్థిని, గాళ్స్ హైస్కూల్, గుంటూరు



పెదపులుగువారిపాలెంలో ఓటు అభ్యర్థిస్తున్న కోన వెంకట్

జగనన్నతోనే సంక్షేమం

సినీ రచయిత కోన వెంకట్

కర్లపాలెం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ తెలిపారు. పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లకు మద్దతుగా కోన వెంకట్ సోమవారం పెదపులుగువారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోన వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం జగన్ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి హామీలను అమలు చేశారని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు నాయుడు మళ్లీ కల్లబొల్లిమాటలతో సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని, అతని మాటలు ప్రజలు నమ్మటంలేదని కోన వెంకట్ తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, నాయకులు చీరాల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసగౌడ్, నంగు నాగేంద్రంరెడ్డి, మార్పు బెనర్జీ, భావన్నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఈసీకి ఫిర్యాదు

అద్దంకి: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా ఎన్నికల బూత్‌ల వద్ద ఇద్దరు అధికారులు టీడీపీ చీఫ్ ఏజెంట్‌కు తొత్తుగా పనిచేశారని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఆ ఇద్దరు అధికారులు స్లిప్పులు పంపిణీ చేసి, అనుమతించకూడని వారిని లోపలికి అనుమతించారన్నారు. దీనిపై అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, ఆధారాలతో ఈసీకి ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు, సోనీ, శివ సోమవారం తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ బాపట్ల లోక్‌సభ అభ్యర్థి నందిగం సురేష్
- వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబుతో కలిసి జంపనిలో ప్రచారం

జంపని(వేమూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్ పేర్కొన్నారు. వేమూరు మండలం జంపని గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగం సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ నవరత్న పథకాలు కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాయన్నారు. వేమూరు నియోజకవర్గం అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2014లో ప్రకటించిన మేనిఫెస్టో ఎంతవరకు అమలు చేశాడో ప్రజలు తెలుసుకోవాలని ఆయన చెప్పారు. రైతులకు రుణామాఫీ చేయలేదని, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేయలేదని, ఇంటి కొక్క ఉద్యోగం ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని తెలిపారు. హామీల అమలు సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. చందోలు డేవిడ్ విజయకుమార్, మూల్పూరు రాజేష్, షేక్ బుజి, ఎంపీపీ యల్లమాటి మోహన్, బొల్లిముంత ఏడుకొండలు, జంపని పురుషోత్తం, ఎంపీటీసీలు అల్లూరు యోనాబాబు, షేక్ బాజీ, తాడిబోయిన అంకమ్మరావు, దాద్ బుడే, అలపర్తి రవి గ్రామ సర్పంచ్ చుండూరు పెద మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రజినిపై అసత్యప్రచారం చేసిన టీడీపీ నాయకులపై కేసు

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి విడదల రజినిపై అసత్య ప్రచారం చేసిన టీడీపీ నాయకులపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా మాధవి, టీడీపీ నాయ కుడు మల్లెల రాజేషులు మంత్రి విడదల రజినిపై అసత్యప్రచారం చేశారు. మంత్రి పరువు నష్టం జరిగేలా అవినీతికి పాల్పడినట్లు కరపత్రాలు పంపిణీ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి విడదల రజిని పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ప్రజాప్రాతినిధ్య చట్టం 123, 127, అదేవిధంగా భారతీయ శిక్షాస్మృతి 171 హెచ్, 171ఐ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

గుంటూరు వెస్ట్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు సోమవారం రెండో రోజు జిల్లావ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండో రోజు సైతం పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. గుంటూరు పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటింగ్ ఉత్సాహంగా సాగింది. రెండో రోజు గుంటూరు వెస్ట్‌లో 639, ఈస్ట్‌లో 392, పొన్నూరులో 285, మంగళగిరిలో 249, తాడికొండలో 244, తెనాలిలో 222, ప్రత్తిపాడులో 297 మొత్తం 2328 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈవీఎంలు భద్రపర్చే గదులు పటిష్టంగా ఉంచండి

అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, పల్నాడు కలెక్టర్ ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఈవీఎంలు భద్రపరచే గదులను పటిష్ఠంగా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి వ్యయ పరిశీలన విషయమై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పీడబ్ల్యూడీ ఓటింగ్ ప్రక్రియపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పీడబ్ల్యూడీ ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎన్ని అనుమతులు ఇచ్చింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వీప్ యాక్టివిటీ, డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ పనితీరు గురించి నిశితంగా వివరాలు సేకరించారు. ఎన్నికల విధులను పటిష్ఠంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం కావాలి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి రజిని, ఎమ్మెల్యే రోశయ్య, విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని కోరారు. నగరంలోని ఆర్.అగ్రహారం, కిరవి టవర్స్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. అపార్టుమెంట్ వాసులతో నాయకులు మాట్లాడారు. మంత్రి రజిని మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా నిలబడుతున్న తనను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సాగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్‌కు సంబంధించి టీడీపీ నేతలు ప్రతిసారి ఏదో ప్రాంతం నుంచి అభ్యర్థులను దిగుమతి చేసుకుంటున్నారని, ఈసారి ఏకంగా విదేశాల నుంచి తీసుకొచ్చారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా రోశయ్య, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా రజినమ్మలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగనన్న పరిపాలన సాగిందన్నారు. రాష్ట్రంలో పేద వర్గాలకు మరింత మేలు జరగాలంటే జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

దొంగ ఓట్లకు కళ్లెం వేసే కళ్లు..

- ఎన్నికల పోలింగ్‌లో బూత్ ఏజంట్లే కీలకం
- ఓటర్ల జాబితాపై అవగాహన
- దొంగ ఓటర్లను గుర్తించే అవకాశం
- బూత్‌కు ఇద్దరు చొప్పున అభ్యర్థికి అవకాశం



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లదే కీలక పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లు అందరూ ఒకటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంది. అందుకే వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రంలో తమ తరఫున పనిచేసే ఏజెంట్ల విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎవరైతే పార్టీకి విధేయులుగా ఉంటారో వారిని నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం, వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం ఏజెంట్ల పని. ఓటర్లను పోలింగ్ ఏజెంట్లు గుర్తించిన తర్వాతే ఓటు వేసేందుకు పోలింగ్ సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్ స్టేషన్ లోనూ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందస్తుగా వారి వివరాలు ఎన్నికల అధికారులకు అందజేయాలి. ఆ తర్వాత ఎన్నికల అధికారి ఫోటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారులు ఫోటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారు. ఒకరి తరుపున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు ఫోటో గుర్తింపు కార్డులను ఇస్తున్నారు.

నియామకం ఇలా..

ప్రతి అభ్యర్థి తమకు నమ్మకమైన వారిని ఆధార్ కార్డ్, మొబైల్ నంబరుతో పాటు ఓటర్ జాబితాలోని సీరియల్ నంబరును తీసుకొని ముందుగా పార్టీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తర్వాత ఎన్నికల అధికారులకు ఆ జాబితా అందజేస్తారు. వారి పరిశీలన అనంతరం ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్‌గా వ్యవహరించాలి? అనే వివరాలతో గుర్తింపు కార్డును మంజూరు చేస్తారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి గుర్తింపు కార్డు పొంది.. మరో కేంద్రంలో ఏజెంట్‌గా వ్యవహరించేందుకు అనుమతించరు.

ఏజెంట్లుగా ఎవరు అర్హులు..

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పోలింగ్ కేంద్రంలో గానీ ఆ పరిధిలో ఉండే గ్రామంలో గానీ ఓటరై ఉండాలి.
- ఓటు హక్కు లేని వారిని నియమించరు.
- పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎటువంటి అధికారాలు ఉండవు.
- పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ప్రచారం చేయకూడదు.
- ఏదైనా పార్టీ తరఫున కేంద్రంలో ప్రచారం చేస్తున్నట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించి, తర్వాత బయటకు పంపిస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- లోక్‌సభ అభ్యర్థి తరఫున ఇద్దరు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి తరఫున ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను చూడాల్సి ఉంది.

రాజకీయపరమైన అంశాల జోలికి వెళ్లొద్దు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు గుంటూరు జిల్లా కలెక్టర్ సర్క్యులర్ జారీ

గుంటూరు ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల నిబంధనావళికి అనుగుణంగా నడుచుకోవాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఆయా సంఘాలకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాజకీయపరమైన అంశాల జోలికి వెళ్లవద్దని సూచిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జిల్లాలోని 18 సంఘాల నాయకులకు సర్క్యులర్ పంపారు. జేఏసీలో భాగస్వామ్యులైన ఏపీఎన్జీఓ, రెవెన్యూ సంఘాలతో పాటు గుర్తింపు పొందిన అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఇందులో ఉన్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు అనుకూలంగా, వ్యతిరేకంగా మాట్లాడరాదని, అదే విధంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా అభ్యంతరకరమైన మెసేజ్‌లను షేర్ చేయరాదని పేర్కొన్నారు. సంఘ సమావేశాలను నిర్వహించుకునే సందర్భంలో సంఘానికి సంబంధించిన అంశాలు మినహా ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశాలకు చోటివ్వరాదని, ఆయా సమావేశాల సారాంశాన్ని జిల్లా యంత్రాంగం అడిగితే ఇచ్చేందుకు వీలుగా వీడియో సైతం తీయించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, మీడియాతో అభిప్రాయాన్ని పంచుకున్నా ఎన్నికల కోడ్‌కు విరుద్ధమేనని పేర్కొన్నారు.